# సుభద్ర

అయ్యలసోమయాజుల సుబ్బారావుగారు

సుభద్ర యిప్పటి నవనాగరిక స్త్రీలలాగ టక్కులు, టిక్కులు, నిక్కులు లేకుండా పూర్వకాలపు స్త్రీల మల్లే యెల్లప్పుడు పురాణగాథలతో కాలక్షేపం చేస్తూండే సాధ్వీమణి; నిరంతర పతిసేవా పరాయణ; అత్త మామలకు ఎదురాడక వారు చెప్పేపనులు శిరసావహించి చేయు క్షమారూపిణి; అన్నార్తులగు భిక్షవాండ్రకు సాక్షాదన్నపూర్ణాదేవి; సుశీల. అంత అందంగా వుండకపోయినప్పటికీ చామనచాయని దేహం, ఆ ఆకర్ణాంత విశాలనేత్రాలూ, ఎల్లప్పుడూ నవ్వులొలికే ఆ ముఖకళ చూస్తే సౌందర్యవతియనే చెప్పొచ్చు. అట్టి సుభద్ర గుణాలకి వ్యతిరేకించాయి అత్తగారు వెంకటనరసమ్మ గుణాలు. రోజూకొకమాటేనా కోడలిమీద చెయ్యిచేసుకుంటేనే గాని చేతి దురద వదలని కోపస్వభావురాలు; ఆవిడ్నిచూస్తే యింట్లో అందరూ గడగడలాడవలసిందే; పెనిమిటి సబ్ కలక్టరు గదా! అందులో అన్నదమ్ములెవరూ లేకపోడంవల్ల పుట్టింటా రాస్తంతా ఆవిడకే కలిసింది. ఇంకేం కొదవ? సర్వవిధాలా అధికారం చెలాయిస్తూ వుంటుంది. ఆఫీసులో కలెక్టరైనా యింటిదగ్గఱ సర్వెంటులాగ వుండవలసినదే; లేకపోతే భర్తయేది వాణ్ణి పుట్టించిన బ్రహ్మయేది వీపు పెట్లవలసిందే.

జగన్నాథం సర్వసద్గుణ సంపూర్ణుడు. తల్లిదండ్రులయందు భక్తి యెక్కువగలవాడు. భార్య అన్నప్రేమే గాని తల్లిమాట జవదాటలేడు. అదీకాక సెలవుల్లో తప్ప యింట్లోవుండేదికూడ లేదుగా. అందుచేత భార్యయొక్క కష్టాలేవీ తెలిసేవికావు. ఇల్లా వుండగా ఇక్కడ సుభద్రకు రోజు రోజూ బాధలెక్కువై పోయాయి. "అసలే కోతి అందులో నిప్పుతొక్కి కల్లుత్రాగిన" దన్నట్లు ఆ వూళ్లో ఓవర్సీరుగానున్న సుబ్రహ్మణ్యంగారి భార్యవచ్చి "వెంకట నరసమ్మొదినా! మీవాడికి పెళ్లయిపోయిందిగాని, లేకపోతే మీ రెంతడిగినా అంతకట్నమిచ్చి మీలాంఛనాలన్నీ జరిపి మాపిల్లనిచ్చేద్దును గదా! ఏంచేస్తాం, చెయ్యికాలిన తరవాత ఆకులు పట్టుకోడంగాని. శుభ్రంగా ఏదో చదువుతోందిగదా! పిల్ల రత్నంలా వుంటుంది. ఆర్మోణీ బాగా వాయిస్తుంది, కలిసొచ్చిన సంబంధం చేసుకొంటే బావుండును, ఇంకేఁవంటే లాభఁవుంది?" అని యీ నిప్పులో కొంత నెయ్యి పోసేది. అందుమీద యీ అగ్గి రవులుతూండేది, ఎన్ని కష్టాలొచ్చి సుభద్రమాత్రం భక్తిగా అత్తమామలకు సేవచేస్తూ భర్తరాకకై ఎదురుచూస్తూండేది.

౨

పరీక్షలు ఆఖరైనాయి. జగన్నాథం సెలవులకు యింటికి వచ్చేశాడు. బ్రహ్మరథం పట్టింది సుభద్ర. వెంకట నరసమ్మ ఓర్వలేకపోయింది. "నవమన్మథుని లాంటి తనకుమారునిదగ్గఱ సుభద్రకు నిలబడడానికేనా అర్హతవుంది?" అనుకొంది. ఇంటిలో దీపంలా వెలుగుతూంటే వాడిదగ్గఱ కోడలిదయ్యానికి మల్లే యిదెందుకుండాలి? నే బ్రతికుండగా చూడలేను. ఏదో అప్పుడు నామెడనిరిచేరు గాని, ఇప్పుడుకూడా నాకొడుకు కష్టపడుతూంటే చేతకానిదానిలాగ ఊరుకోవలసినదేనా? ఈ దయ్యం గ లేకైతే నాకేం నిక్షేపంలాంటి కాళ్లకే కడుపుకే అచ్చొచ్చిన సంబంధం. ఆ ఓవర్సీరుగారి కుమార్తెను పెళ్లిచేసేస్తాను." అనుకొంది. ఆ రోజు అయిదారుమాట్లేనా కొట్టి వుంటుంది సుభద్రను. "దీన్ని తగిలేయడ మేలాగా?" అనే ఆలోచన పగలల్లా. రోసకి తనింట్లో నౌకరీ

అప్పలస్వామిని పిలిచి సంగతంతా చెప్పి ఎలాగైనా రాత్రి రెండుగంటలవేళ సుభద్ర గదిదగ్గర నిలబడమంది. వాడు ముందొప్పుకోలేదు గాని అమ్మగారు చెయ్యితడిచేసేసరికి ఒప్పుకున్నాడు. ఆహా! అర్థమహిమ! ఒక్కక్షణములో మాతాపుత్రులకు కూడ పరస్పర విరోధభావాలు కలగజేస్తుందిగదా! ఇంక ఒక తుచ్ఛుని దుష్పథం త్రొక్కించుటలో లెక్కా?

సుభద్ర రాత్రి పదిగంటలవఱకు గృహకృత్యాలు చేసుకొని చెంబుతో మంచినీళ్లు పుచ్చుకొని పడకగదిలోకి వెళ్లింది. కసరికొట్టేసింది వెంకటనరసమ్మ. "మేం వేదో మాట్లాడుకుంటూంటే నువ్వెందుకే యిక్కడికి? వెళ్లు. తరవాత వద్దువుగాని లే!" పొమ్మంది. ఏంచేస్తుంది పసారాలోనే కొంతసేపు కూర్చొని నిద్రకాగలేక అక్కడే పైటకొంగు పఱచుకొని పడుకుంది. ఆ వెక్కడ కబుర్లో గాని రాత్రి రెండుగంటలవఱకు కొడుకును వేపుకుతింది. చాలా కాలానికి కలుసుకొని కష్టసుఖాలు మాట్లాడుకుందాంవని ఎంత ఉబలాటపడతారో నవీన దంపతులు? జగన్నాథానికి అసలు సంగతి తెలుస్తేగా! తనమీది ప్రేమచేతనే తల్లి యింతరాత్రి కష్టసుఖాలు మాట్లాడిందనుకొన్నాడు. ఈ వొక్కరోజు తల్లిమాట వింటే రేపటినుంచి కులాసాగా వుండొచ్చు ననుకున్నాడు. ఇంతలో పసారాలో చప్పుడైంది. మాతాపుత్రులిద్దరూ చూడ్డానికి వెళ్లారు. మంచందగ్గఱ నిలబడియున్న నౌఖరు అప్పలస్వామిని, లేస్తూన్న సుభద్రను చూచారు. తెల్లబోయింది సుభద్ర. నౌఖరీవాడు తన మంచందగ్గిఱ కెలా వచ్చేడో తెలీదు. ఏదో చప్పుడైతే తనుకూడా లేచింది. ఇంతకూ కారకురాలు వెంకటనరసమ్మ వూరుకుంటుందీ!

"ఆసి! నీ మొగం తగలెయ్యా! ఎంతపని చేస్తున్నావే! వెధవా! నువ్వవచ్చావురా? అప్పలస్వామీ! నువ్వే? నీకేం పోయేగాలం వచ్చిందిరా! తినుండలేక తిన్నింటివాసాలే లెక్కపెట్టడం? ఇంతకీ నిన్నేదేవుంది. మావస్తువుమంచిది కాకపోయాక ఇంకా కదలవేం?" అంటూ నిజంగా కొట్టడానికి మళ్లే వో దెబ్బ వేయబోయేసరికి పారిపోయాడు అప్పలస్వామి. ఇంక సుభద్రపై నానాహంగామాచేస్తూ, చితకతంతూ తెల్లవార్చేసింది కేకలతో వెంకటనరసమ్మ. జగన్నాథం భార్యయొక్క గుణం తనకు తెలియును గాని యేంచేస్తాడు? ప్రత్యక్షంగా కనబడుతూంటే. తల్లియాజ్ఞకు బద్ధుడై వాల్సొచ్చింది. తిరిగి వివాహమయిపోయింది నెలరోజులలో. ఓవర్‌సీరుగారితో వియ్యమందినందుకు ఉప్పొంగిపోయింది వెంకటనరసమ్మ. పాపం సుభద్రకుముందుమయ్యి, వెనక గొయ్యిపాటొచ్చింది. ఏంచేస్తుంది; పుట్టింటియాక లేదు, తల్లిదండ్రులు సుభద్ర పెళ్లయిన సంవత్సరంలోనే చనిపోయారు. ఓ మేనమామమాత్రం ఉన్నాడు గాని ఎక్కడున్నాడో తెలీదు. ఇంక అత్తింటిస్థితి యిలావుంది. ఇంక దాసీదానిలాగ యింట్లో పని చేస్తూ వుంది. అప్పుడప్పుడు చచ్చిపోదాంవని నూతిదగ్గఱకు వెళ్లేది. ఆ సమయానికల్లా యెవరో వకరు వచ్చేవారు. అవమాన దుఃఖంలో వుండినప్పటికి నాథుని సేవ మానేదికాదు. ఎప్పటికైనా రహస్యం దాగుతుందా? వెంకటనరసమ్మ వొప్పుకున్నప్పటికీ వూళ్లోవారు తన్ని తగిలేశారు అప్పలస్వామిని; భార్యాపిల్లలను పోషించలేక అల్లల్లాడిపోతున్నాడు. ఇంకెవ్వరూ గూడ నౌఖరీ యివ్వడం మానేశారు. పైవూరు పోదామన్నా డబ్బులేదు. ఉన్నడబ్బల్లా అదివఱకే ఖర్చుపెట్టేశాడు. ఇంకేం చేస్తాడు? జోలితగిలించుకొని తిరగడం ప్రారంభించాడు. ఓరోజు సుబ్రహ్మణ్యంగారింటికే ముష్టికి వచ్చాడు. అడగలేక అడగలేక "అమ్మా! ముష్టి." అన్నాడు ఛా! ఛా! పోకిరీ వెధవా! పోతావా? గెంటించనా!" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

అప్ప:—బాబూ! నిన్నటినుండి తిండిలేక మల మల మాడిపోతున్నారు పిల్లలు. రక్షించండి! బాబయ్యా!

సుబ్ర:—ఏం? వెధవపని చేయకపోతేనేం? ఈ యేడ్పు లేదవకపోతేనేం? వెళ్లు! వెళ్లు!

అప్పు:—బాబయ్యా! క్షమించండి! నేరక గడ్డి తిన్నాను. పాతిక రూపాయలిస్తానంటే ఈ వెధవపని చేశాను.

సుబ్ర:—ఎవర్రా! నీకు పాతిక రూపాయలిచ్చి ఈపని చేయించినవారు?

అప్పు:—వెంకట నరసమ్మగారండి!

సుబ్ర:—ఛీ! దుర్మార్గపువెధవా! ఆ యిల్లాల్ని గూడ యిందులోకి తోస్తున్నావా? తన్నులంతి నేవు. జాగ్రత్త!

అప్పు:—పిల్లలతోడు బాబయ్యా! నేనుచెప్పే దంతా నిజమండి! నమ్మితే నమ్మండి! లేకపోతే మానీయండి!

సుబ్ర:—నిజమా? ఆ నిజమేమిటో చెప్పూ!

అప్పు:—ఆవేళ సాయంత్రం నన్ను పెద్దమ్మగారు పిలిచి రాత్రి రెండుగంటలకల్లా సుభద్రమ్మగారి గదిదగ్గఱ తిర్గాడమన్నారు. "ఎందుకండి! నేనాపని చెయ్యను" అన్నాను. అప్పుడు దబ్బు; పాతిక్కీదబ్బు; నాకిచ్చి నాచేత వొప్పించుకున్నారండి! పాతిక రూపాయల కాశపడ్డానండి! నే చేసినపని తప్పే బాబు! మీ పాదాలమీద పత్తాము బుద్ధొచ్చింది. ఇంక నేనా నమ్మకంవుంటే ఇంతతిండి పెట్టించండి ఆకలి దహించుకుపోతోంది.

సుబ్ర:—అబ్బా! ఎంత నెరజాణవే! వెంకట నరసమ్మా! నిజంగా అలాచేసిందిరా?

అప్పు:—నిజమండి! బాబయ్యా! సుభద్రమ్మ గారేమీ ఎరుగరండి! నేనొచ్చినట్టు తెలవడానికి దగ్గినదగ్గే అప్పి లేపింది కాని, ఆవిడ నిజంగా గౌరీ దేవేనండి!

సుబ్ర:—పో! యీరూపాయిపుచ్చుకొని బియ్యం కొనుక్కో! పశ్చాత్తాపం వచ్చింది గనుక బాగు పడతావులే!

అప్పు:—శెలవు దయచేయించండి; బాబూ!

సుబ్ర:—వెళ్లు!

## 3

సుబ్ర:—జానకీ! జానకీ! నే చెప్పినమాటలు జ్ఞాపక మున్నాయా?

జానకి:—ఆ! జ్ఞాపకమున్నాయి నాన్నగారూ! కానీండి నేవెళ్లొక నవరిస్తాగాదూ!" అని వెళ్లి పోయింది జానకి. సుబ్రహ్మణ్యంగారు అప్పులస్వామి చెప్పిన మాటలన్నీ నమ్మి 'వెంకటనరసమ్మకు ప్రాయశ్చిత్తంచేయడం ఎలాగా?' అని ఆలోచించి తన కుమార్తె జానకిని పిలిచి నేర్పవలసినవన్నీ నేర్పుతూ వుండేవాడు. కాలేజీలో చదువుతూ ప్రపంచవార్తలు నాలుగూ వింటూవుండడం వల్లను, అసలే బుద్ధిమంతురాలౌటవల్లను జానకి తండ్రిచెప్పిన మాటలువిని అవగాహనచేసుకుంటూండేది. అత్తవారింటికి వెళ్లిన తరవాత చేయవలసిన పనులన్నీ రోజూ పాఠం వప్పగించేది. సుభద్ర కష్టాలు ఎప్పుడు పోగొడ్తానా అనే ఆలోచించేది. ఏం? సుభద్ర కష్టాలుపడితే తనకేం? దయా ప్రపూర్ణయగు జానకి అన్యాయంగా తనలోటి యొక స్త్రీవ్యక్తి కష్టపడుతూంటే వూరుకో గలదా? సమస్త విద్యల్లోను శక్తియుక్తురాలగు జానకి తనచే కావలసినపనికి వెనుతీస్తుందా? శ్రావణమాసంవస్తే, అట్ల తద్దికి ప్రతీపండుక్కీ జానకిని తీసుకెళ్లేవారు. అక్కడకి వెళ్లినప్పుడల్లా సుభద్రపాట్లుచూచి జాలి పొందేది. దుఃఖించేది కూడాను.

కొన్నాళ్లకు జానకి వ్యక్తురాలయింది. వెంకటనరసమ్మ మిన్నందుకుంది. అందమైనపిల్ల, చదువుకొన్న పిల్ల, దైవకటాక్షంవల్ల కొడుక్కిగాని యే పెద్ద వుద్యోగమేనా అవుతే కొడుకు, కోడలు ఇంగ్లీషు మాట్లాడుకుంటూంటే సరదాగా వింటూ కాలక్షేపం చేయొచ్చు, వంటకేదో సుభద్రవుందికదూ? ఇంకనేం కులుకుతూ కూర్చుందామనుకుంది. పైన దైవంలేడూ?

మలేరియా జ్వరంవచ్చి సబ్ కలెక్టరుగారు స్వర్గం వేంచేశారు. ఊరంతా "కోడలు ప్రవర్తించిన నక్షత్రం మంచిదికాదమ్మా!" అంటూ నాలుగక్షింతలు జానకి నెత్తిమీద పోశారు. కావలసి కోరితెచ్చుకున్న పిల్ల గదా వెంకటనరసమ్మ ఊరుకోంటుందా! కొత్తవెధవ ముండయినప్పటికీ పూరందరికీ సమాధానం చెప్పేది సుభద్ర చెడునడతవల్లనే నిక్షేపంలాంటి నిధి పోయారంటూ. అదేమంటే నమ్మేవాళ్ళెవరు? అదివరకే తెలిసిపోయాయి వెంకటనరసమ్మ గుణాలు.

కార్యంచేసుకొని మీపిల్లను మీరు తీసుకెళ్ళమని తొందరచేస్తున్నారు సుబ్రహ్మణ్యంగారు. దినవారాలయింతరవాత ఆ అవకాశం కాస్తా తీర్చుకొని జానకిని తీసుకొచ్చింది వెంకటనరసమ్మ. జానకి అత్తారింటికి వెళ్ళిన కొద్దిరోజుల్లోనే తండ్రిగారి పుద్యోగమే జగన్నాథానికిచ్చారు. ఏ నోటితో జానకిని తిట్టారో ఆ నోటితోనే భూషించారు లోకం. వెళ్ళిన రెండు మూడు నెలలు అలవాటయ్యేవరకూ అత్తగారిపట్ల అణకువగానే వుంది జానకి. అక్కడనుండి కొంచెం పెడసరపుమాటలు, వెక్కిరింతలు ప్రారంభించింది. కోరిచేసుకున్న పిల్లేమో, ఏమీ అనలేకపోయింది వెంకటనరసమ్మ. ఒకప్పుడెప్పుడేనా కూకలేస్తే టిల్లిగ్రాం వెళ్ళిపోయేది సుబ్రహ్మణ్యంగారి దగ్గిరికి. ఆయన అల్లుడు లేకుండా చూచివచ్చి "ఇంకెప్పుడేనా కూకలేశావంటే గుండెట్టుకు యీడ్పించేస్తానంటూ ఆడావిడిచేసి పోయేవాడు. కొడుకొచ్చేసరికల్లా యీ సంగతి చెపుదామని ఎదురుగా వెళ్ళబోయేసరికి జానకి కనిపెట్టి తనే ముందుగావెళ్ళి కావలించుకొని తీసుకుపొయ్యేది గదిలోకి. అక్కడికికూడా రానీలులేకుండా గడియవేసి మరీ వెళ్ళిపొయ్యేది. సగల్లా ఆఫీసులోను ఇంటిదగ్గరున్నప్పుడు జానకిదగ్గరతప్ప యింకెక్కడికీ వెళ్ళడానికి వీల్లేకపోయింది జగన్నాథానికి. ఒకప్పుడెప్పుడేనా సరదాపుడితే బేట్‌మింటాడుకోటానికి క్లబ్బుకు వెళ్ళేవాడు. ఇల్లా రెండు నెలలు కొడుకుతో మాట్లాడ్డానికి వీల్లేకుండా చేసింది వెంకటనరసమ్మను జానకి. ఈ అవమానం భరించలేక వెంకటనరసమ్మ యిరుగు పొరుగువారితో చెప్పుకొని విచారిస్తూండేది. "ఏమమ్మా! బుద్ధిమంతురాలైన సుభద్రమీద లేనిపోని నేరాలుకల్పించి కోరి కొడుక్కి రెండో వివాహంచేసి యిప్పుడీ కోడలిమీదకూడా నేరాలేనా? నీ కొచ్చిన యేళ్లు యెవరికొచ్చాయి? చాలు! చాలు! ఊరుకో నవ్విపోయేరు" అని వారు చీవాట్లు తిరిగిస్తే నోరుమూసుకుని యింటికి వచ్చేసేది. ఇంతకీ వొక్కదానికిమాత్రం సంతోషించింది. సుభద్ర నేలుకోలేదనే. ఆ సంతోషంకూడా కలకాలం నిలపడలా. "మా సుభద్రక్కయ్య నేలుకుంటేనే గాని నేనుకూడా మీకు లేనిదాననే." అంది జానకి. సుభద్రగుణాలు తనకు చూచాయగా తెలిశాయి కాబట్టి సుభద్రనుకూడా ప్రేమతో చూస్తున్నాడు జగన్నాథం. ఇంక మూలుగులు, మూతివిరుపులు ప్రారంభించింది వెంకటనరసమ్మ. రోజుకు వోమారేనా ఖాళీ చూచుకొని సుభద్రను తిడుతూనేవుంది.

ఓరోజున వంటకాలస్యంగా మడికట్టుకుందని పెరటపడి తెగతిడుతోంది. జానకి వింది. "ఏమమ్మో! మీరుగాని యిలాతిట్టేరంటే వేరేవుండొచ్చు, తిని కూర్చోలేక యేమిటీ కేకలు? రేపటినుండి మీరే మడికట్టుకోండి! మేం చేసేదిలేదు. వుంటేవుండండి! పోతే పోండి." అంది జానకి. ఆమాటకి నిలుచున్న పాటున కూలబడిపోయింది వెంకటనరసమ్మ. గట్టిగా మాట్లాడ్తే యముడులాగవచ్చి పడిపోతాడు సుబ్రహ్మణ్యంగారు. తనకోరికపైని తనకుకలిసిన పుట్టింటి ఆస్తి కోడలిపేర రాస్తేగాని పిల్లనివ్వనంటే సంతోషంగా రాసి జానకిని కూర్చింది కొడుక్కి. పూరంతా ముద్దుకోడలంటూండేవారు జానకిని. ఇప్పుడుగాని జానకిమీద నేరాలు పైవాళ్ళతో చెప్తే చేన్నీళ్లు జల్లుతారని భయంకలిగింది. కుమారునితో మాట్లాడ్డానికూడా నోచుకోలేదు. కుళ్లి కుళ్లి విచారించింది. ఇంతజరిగినా సుభద్రంటే సవతితల్లిప్రేమగానే వుండేది.

## ४

సంవత్సరాది పండుక్కి జానకి పురమాయింపువల్ల బొబ్బట్లొండింది వెంకటనరసమ్మ. జగన్నాథం భోంచేసి వెళ్లిపోయాడు. సుభద్రకు జానకికికూడా వడ్డించి తనుపెట్టుకు తింటూంది వాళ్లని పిలవకుండానే. జానకీ సుభద్రా మంతనాలాడుకుంటూ భోజనానికి వచ్చారు; వడ్డించిన విస్తళ్లు చూచి తెల్లబోయింది జానకి. సుభద్రకు వడ్డించిన విస్తరిలో ఏంవుంది? కూర, అన్నం! జానకికి బొబ్బట్లుపెట్టి తనకు పెట్టుకొని సుభద్రపై కోపంచేత పెట్టడం మానేసింది. అదికనిపెట్టి జానకి చట్టున తనవిస్తరిలోని పిండివంటలు సుభద్ర విస్తరిలో పెట్టేసి గబగబా వెంకటనరసమ్మ పెట్టుకున్నవన్నీ తనవిస్తరిలో పెట్టేసుకుంది.

"అయ్యో! అయ్యో! అదేం? జానకీ! మైల పర్చేశావ్?" అంది వెంకటనరసమ్మ.

జానకి:—మాట్లాడకమ్మా! నీచప్పునిచేసి పైగా మాట్లాడుతారు. ఇంటికి పెద్దకోడలే! పరమ పతివ్రతే! అట్టిదానిమీద లేనిపోని నిందలుమోపి దాసీ దానికన్న హీనంగాచూచి తిరిగి కొడుక్కి పెళ్లిచేస్తారూ!! దైవంలాచూసేదే! అందంగాలేదనా? స్త్రీకి రూపం, గుణంగాని యీ వెధవచర్మంకాదు లోకులంతా కూడ మిమ్మ దేపనిగా చెప్పుకుంటున్నారే! మీ గొప్ప నాదగ్గ చెప్పనికిరాదు; మామీద మీరు ప్రేమగావుంటే మిమ్మల్నిభక్తి శ్రద్ధతో పూజించుకొంటామే! ఇంక మీ కిష్టంలేకపోతే ఏంచేయండి! తలుపుతీస్తాను." అన్నీ మాటలు విని వెంకటనరసమ్మ. కళ్లవెంట నీళ్లు గిర్రున తిరిగాయి. చట్టున జానకిచేతులు పట్టుకొని ఏడవడం ప్రారంభించింది. "పశ్చాత్తాపంవొచ్చింది, యింకేం వనకూడ"దనుకొంది జానకి. కొంతసేపటికి గద్గదస్వరంతో 'క్షమించు' అంది వెంకటనరసమ్మ. అప్పుడు సుభద్రవచ్చి "అత్తా! మిమ్మల్ని క్షమించడానికి మేంవర్హులమా? మీ ఆశీర్వచనఫలితంవల్లే యిల్లా వున్నాము. ఊరుకోండి." అని వెంకటనరసమ్మను వసారాలోకి తీసుకుపోయి ఉపచారాలు చెయ్యడం ప్రారంభించింది. జానకికూడ సంతోషించి నూతికి పోయి స్నానంచేసి త్వరగా వంటచేసి వెంకటనరసమ్మను భోజనానికి పిలిచింది "రాత్రి ఫలహారం చేస్తాలే! ఇంక తినకూడదు." అంది వెంకటనరసమ్మ. "ఇప్పుడుగాని మీరు భోంచేయకపోతే ఇంకా కోపం వుందనుకుంటాం." అంది సుభద్ర. తప్పని సరిగా మడి కట్టుకుని రెండు మెతుకులు కొరికింది వెంకటనరసమ్మ.

సాయంత్రం వచ్చేసరికల్లా ఇష్టాగోష్టిగామాట్లాడుకుంటూన్న అత్తాకోడళ్లనుచూచి ఆశ్చర్యపోయ్యాడు జగన్నాథం. ఆనందంతో "అమ్మా! నాకు ప్రమోషనుకి ఆర్డరొచ్చింది." అన్నాడు. "మీరుచెప్పిన వార్తకంటె శుభవార్త చెపితే యేమిస్తారు!" అంది జానకి.

జగ:—ఏమిటది?

జానకి:—ఈరోజునుండి మీజట్టు మానేశాం.

జగ:—ఎంచేతో?

జాన:—అత్త మామీద ప్రేమజూపుటచేత.

జగ:—అయితే! అత్తగారిని పూర్తిగా వలలో వేసుకొన్నామన్నమాటే?

జానకి:—'ఆల్ రైటు' గాను.

జగ:—పెంకా!

వెంక:—కుంకా!

జగ:—అదేంవమ్మా! నువ్వలాఅంటావు?

వెంక:—నాయనా! చిన్నదయినప్పటికి జానకికి ఉన్నబుద్ధి మనకుంది! సాక్షాత్ జానకీదేవే. అశాశ్వతమైన తనువుచూచి అందంలేదనీ దూషించాను. మణిని రాయికింద భావించి మహాపాప మొండికట్టుకున్నాను. ఇంక నాచేష్టలన్నీ మరిచిపోయి కొత్త వెంకటనరసమ్మననుకోండి!

సుభద్ర:—గతజల సేతుబంధం యెందుకత్తా! భోజనానికి లేవండి!

వెంక:—నాయనా! లే! మడికట్టుకో!

కొంతకాలం నయింది యిద్దరిమనుమల్ని చెరో ప్రక్క కూర్చోబెట్టుకొని ఆనందిస్తోంది వెంకటనరసమ్మ భాగవతంవింటూ—జానకి ఒక్కొక్క పద్యమే చదువుతూ అర్థంచెప్తుతోంది. అదెల్లప్పుడూ దినచర్యగా! ఆగృహలక్ష్మి అల్లాగే ఉంటుందని నమ్మకం ఐకమత్యం ఉంటే ఉండదూ?